క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ప్రపంచ కవితా దినోత్సవాన్ని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత పలువురు కవులతో కవి సమ్మేళనాన్ని జరిపారు. అనంతరం రచయిత శ్రీరామకవచం సాగర్ నవల 'నిర్వేదం' ఆవిష్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ చిన్ని నారాయణరావు, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కవి బారహంతుల్లా, పెన్నా రచయితల సంఘ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, శ్రీధర్‌బాబు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అఖండ దీప పథకానికి విరాళం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన అమ్మవారి అఖండ దీప పథక నిర్వహణకు అవసరమైన ఆవు నెయ్యి కోసం రూ.1,00,116 విరాళాన్ని వేమసాని గౌతమ్ కుమార్ శుక్రవారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డికి దేవస్థాన కార్యాలయంలో ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడారు. అఖండ దీప పథకానికి రోజూ మూడు లీటర్ల ఆవు నెయ్యి అవసరమవుతుందని, దీనికి రూ.రెండు వేలు ఖర్చవుతుందని చెప్పారు. విరాళమిచ్చిన దాతల పుట్టినరోజు, పెళ్లి రోజు, ముఖ్యమైన సమయాల్లో వారి గోత్రనామాలతో ఖడ్గమాల పూజను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

వేడుకగా రాహుకాల పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల ఉద్యాపన పూజలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పూజలకు 24 మంది భక్తులు హాజరై అమ్మవారికి పసుపు, కుంకుమ, 108 నిమ్మకాయలతో మాల తదితరాలను సమర్పించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

రేషన్ కార్డుదారులు ఈ - కేవైసీ చేయించుకోవాలి

నెల్లూరు(పొగతోట): రేషన్‌కార్డులు కలిగిన వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ – కేవైసీని విధిగా చేయించుకోవాలని డీఎస్‌ఓ అంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం, చౌక దుకాణ డీలర్లను సంప్రదించి ఈ ప్రక్రియను చేయించుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలకు మినహాయింపునిచ్చారని వివరించారు.

ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

నెల్లూరు (పొగతోట): సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞానంపై గుంటూరు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రదర్శనను కేంద్ర వ్యవసాయ శాఖ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్నారని ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ లలితాశివజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ అండ్ నికోబార్ రైతులు పాల్గొననున్నారని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి రైతులు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు సంఘ నేతలు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సుమారు 300 వరకు స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారని వెల్లడించారు. సదస్సును సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



తోటపల్లిగూడూరు మండల నేతలు, కార్యకర్తలతో సమావేశమైన కాకాణి

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో తోటపల్లిగూడూరు మండల నేతలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా, నష్టం వాటిల్లినా అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో విధ్వంసకర పాలన సాగుతోందని, గ్రామస్థాయిలో సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో మండలాల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నానని చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలొచ్చినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని ప్రకటించారు. పార్టీ నేతలు, కార్యకర్తలపై వివక్ష చూపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని వదిలేదిలేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి మారుపేరుగా గ్రామాలు నిలిచాయని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ అవినీతి పాలనలో దోపిడీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం చురుగ్గా పనిచేసే సమర్థ కార్యకర్తలకు వివిధ స్థాయిల్లోని పార్టీ కమిటీల్లో స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారన్నారు. జగనన్న 2.0లో నేతలు, కార్యకర్తలకు అధిక ప్రాధాన్యమివ్వనున్నారని చెప్పారు.

టౌన్‌ప్లానింగ్ విభాగాధికారులతో సమావేశం



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగాధికారులతో సమావేశాన్ని అదనపు కమిషనర్ నందన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఎమ్మెస్సెమ్‌ఈ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన డైరీలను వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు అందజేశారు. సిటీ ప్లానర్ పద్మజ ఏసీపీలు వేణు, ప్రకాష్, సూపరింటెండెంట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ధర్నా



బిల్లులను దహనం చేస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ నగరంలోని విద్యుత్ భవన్ ఎదుట ధర్నాను సీపీఎం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కరెంట్ బిల్లులను దహనం చేసిన అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే చార్జీలను తగ్గిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన టీడీపీ, ప్రస్తుతం ఆ అంశాన్నే విస్మరించిందని ఆరోపించారు. ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం మోపారని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడాన్ని సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. అదానీతో చేసుకున్న సెకీ ఒప్పందంలో రూ.1,750 కోట్ల అవినీతి జరిగిందని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆరోపించిన టీడీపీ, ప్రస్తుతం వారితో ఒప్పందం కుదుర్చుకోవడం దుర్మార్గమన్నారు. చార్జీలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం విద్యుత్ అధికారి శేషాద్రి బాలచంద్రకు వినతిపత్రాన్ని సమర్పించారు. నేతలు పెంచలనరసయ్య, రఫీ అహ్మద్, మాలకొండయ్య, షాహినాబేగం, సుధీర్, శ్రీనివాసులు, షనజీర్, సత్తార్, రత్నం, రమణయ్య తదితరులు, పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్ రాక సైన్స్ విజయం



బిస్కెట్ల పంపిణీ



వెంకటేశ్వరపురంలో..

నెల్లూరు(అర్బన్): స్పేస్ స్టేషన్ నుంచి తొమ్మిది నెలల తర్వాత సునీతా విలియమ్స్ భూమికి సురక్షితంగా తిరిగి రావడం సైన్స్ అద్భుత విజయమని ఆర్థోపెడిక్ శ్యామ్‌ప్రసాద్ శశాంక్ పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రం.. సునీతా విలియమ్స్ విజయాలు అనే అంశంపై డైకస్ రోడ్డులోని వియానీ హోమ్‌లో విద్యార్థులకు సదస్సును కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, తినుబండారాలను అందజేశారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, సత్తార్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, రాము, హోమ్ సిస్టర్స్ రమ, జయ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): యువతకు సునీతా విలియమ్స్ ఆదర్శనీయమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ పేర్కొన్నారు. సునీతా విలియమ్స్‌కు అభినందన ర్యాలీని వెంకటేశ్వరపురంలోని విశ్వభారతి పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమ్రాన్‌ఖాన్, కరస్పాండెంట్ షకీలా, కృష్ణ, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ' విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలకు చెందిన 93 మంది విద్యార్థినులకు రూ.ఎనిమిది లక్షల స్కాలర్‌షిప్‌ను మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో శనివారం అందజేయనున్నామని ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను శుక్రవారం విడుదల చేశారు.

నిత్యావసర సరుకుల అందజేత



నెల్లూరు(అర్బన్): దీన్‌దయాళ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మానికల సంజీవమ్మ ఇల్లు అగ్నికి ఆహుతవడంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేయూతనందించారు. రెడ్‌క్రాస్ విపత్తుల సంస్థ తరఫున సంజీవమ్మకు వంట పాత్రలు, నిత్యావసర సరకులు, తాత్కాలిక నివాసానికి అవసరమైన టార్పాలిన్ పట్టలు తదితరాలను శుక్రవారం అందజేశారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ



నెల్లూరు(బారకాసు): నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గల సీసీ కెమెరాల ద్వారా ఎంహెచ్‌ఓ చైతన్య శుక్రవారం పరిశీలించారు. వివిధ డివిజన్లలో అవసరమైన పారిశుధ్య పనులను సంబంధిత శానిటేషన్ అధికారులకు వివరించారు. అనంతరం డైకస్ రోడ్డు, కొత్తూరు తదితర ప్రాంతాల్లో వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వారితో మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేసే వారిని గుర్తించి జరిమానాలను విధించనున్నామని వెల్లడించారు. ఫ్లోర్, గార్బేజ్ పాయింట్లుగా ఉన్న వివిధ ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

బీజేఎంఎం ఆటోస్టాండ్ ప్రారంభం



నెల్లూరు రూరల్: మినీబైపాస్‌లోని పీటీజీ పెట్రోల్ బంక్ సెంటర్‌లో బీజేఎంఎం ఆటో స్టాండ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. నేతలు కిరణ్‌కుమార్, యరబోలు రాజేష్, ప్రభాకర్, రాములు, పిట్టి మహేష్, ఆటో స్టాండ్ అధ్యక్షుడు మణి, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు పాల్గొన్నారు.

చెత్త కుండీలను మార్చేదెప్పటికో..?



నెల్లూరు(బారకాసు): నగరంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీలు శిథిలావస్థకు చేరుతున్నాయి. నవాబుపేట, మసీదు సెంటర్‌లోని చెత్తకుండీ చుట్టూ ఉన్న ఇనుప రేకు తుప్పుపట్టి ఊడిపోయింది. చెత్తాచెదారాన్ని ఇందులో వేసినా, అదంతా బయటకొచ్చేస్తోంది. దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బడ్జెట్లో విడుదల చేసిన నిధులెక్కడా..?



సీపీఎం నేతల ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దోమల నివారణకు నగరపాలక సంస్థ బడ్జెట్లో విడుదల చేసిన రూ.వందల కోట్లు ఎక్కడికెళ్తున్నాయని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణ, శ్రీనివాసులు ప్రశ్నించారు. నగరంలో దోమల బెడద, పారిశుధ్యం, తాగునీటి సమస్యలను పరిష్కరించాలంటూ బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయం నుంచి స్థానిక సచివాలయం వరకు ర్యాలీని పార్టీ నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు, నేతలు నరసింహ, సుబ్బమ్మ, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మూలం ప్రసాద్, ఫయాజ్, ఏమేలు, సంపూర్ణమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ షాపులకు వేలం

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ షాపులకు సంబంధించిన వేలాన్ని చిన్నబజార్‌లోని ఏసీ సుబ్బారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్వహించామని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు శుక్రవారం తెలిపారు. ప్రక్రియకు పది మంది హాజరయ్యారని చెప్పారు. 13 షాపులకు గానూ మూడింటిని దక్కించుకున్నారన్నారు. రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా లార్వా సర్వే



నెల్లూరు(అర్బన్): లార్వా సర్వేను ఆరోగ్య కార్యకర్తలు పక్కాగా చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. నగరంలోని జేవీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న లార్వా సర్వేను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. వ్యాధులకు కారణమయ్యే దోమలను నివారించాలని సూచించారు. కీటక జనిత వ్యాధులపై నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న సమావేశానికి పురుష ఆరోగ్య సహాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.

మనోహరం.. గాయత్రి గాత్రం



గాయత్రి గాత్రకచేరి



కోదండరాముడి అలంకారం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిర ప్రాంగణంలో త్యాగరాజ స్మరణోత్సవాలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహిస్తున్నారు. కోదండ రాముడి అలంకారంలో స్వామివారు శుక్రవారం దర్శనమిచ్చారు. చెన్నైకి చెందిన గాయత్రి గాత్రకచేరి వీనులవిందుగా సాగింది. వాద్య సహకారాన్ని గాయత్రి విభావరి, గురుప్రసాద్, సాయినాథ్ అందించారు. వాణిశ్రీ భాగవతారిణితో భీష్మప్రతిజ్ఞ, భారతి భాగవతారిణితో కృష్ణరాయబారం, ధూళిపాళ్ల శివరామకృష్ణశర్మ భాగవతార్‌తో రుక్మిణీ కల్యాణ హరికథలను జరిపారు. గాత్ర, వీణ కచేరీలను ఔత్సాహిక కళాకారులు నిర్వహించారు. స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

చారిత్రక విశేషం.. త్యాగరాజ స్మరణోత్సవం

సమస్త మానవాళికి భక్తిమార్గాన్ని బోధించిన మహనీయుడు త్యాగరాజస్వామి అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఢిల్లీ నుంచి ఆయన సందేశం పంపారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకుస్థాపనలు చేపట్టిన అన్ని పనులను పూర్తి చేసేలా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. మాజీ మేయర్ నందిమండల బానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న నాగార్జునరావు

నెల్లూరు(అర్బన్): కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలని మలేరియా సహాయాధికారి నాగార్జునరావు సూచించారు. కోటమిట్ట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్‌లో చేపట్టిన రక్త పరీక్షల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని కోరారు. పరిశుభ్రతతో పలు రకాల వ్యాధులను అరికట్టొచ్చనే అంశాన్ని వివరించాలని సూచించారు. అధికారి రామారావు, సీఓ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.